

**పండరీపూర్ మహా పాదయాత్ర** 2



**నిలిచిన ఆర్టీసీ బస్సు** 2

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

2-7-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## ఆరోగ్య సేవల్లో లోపాలు కనిపించొద్దు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజలకు అందించే ఆరోగ్య సేవల్లో లోపాలు కనిపించవద్దని డీఎంహెచ్‌వో వెంకట్ అన్నారు. మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుకున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించకూడదని వైద్యుడు శరత్ కుమార్‌కు సూచించారు. ఆస్పత్రి సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాచారం ఉందని ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెయూ యూజీసీ అఫైర్స్ డైరెక్టర్‌గా పాత నాగరాజు



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ యూజీసీ అఫైర్స్ డైరెక్టర్‌గా అర్థశాస్త్ర విభాగం సహ ఆచార్యుడు పాత నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి ఉత్తర్వులు అందజేశారు. నాగరాజు గతంలో అర్థశాస్త్ర విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘ అధ్యక్షుడిగా, ప్రిన్సిపల్‌గా, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ డైరెక్టర్‌గా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్‌గా బాధ్యతలు నిర్వహించారు. యూజీసీ అఫైర్స్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ నాగరాజుకు తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. యూజీసీ అఫైర్స్ డైరెక్టర్ గా నియమించినందుకు వీసీ, రిజిస్ట్రార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటుహక్కు అత్యంత విలువైనది



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని టీపీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డిలోని తన నివాసంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వివరాలు నమోదు చేసుకున్నారు. తన సతీమణి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ కుటుంబ సభ్యులతో కలిసి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా అర్హుల పేర్లు తొలగిపోకుండా, డూప్లికేట్ ఓట్లు ఉండకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని, 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదుకు సహకరించాలని కోరారు.



ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్‌జీ చట్టం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టం ఉపాధి హామీ కూలీల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపనుంది. కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ నిర్ణయం పెద్ద ఊతంగా మారనుంది. గతంలో కంటే పని దినాలను పెంచడంపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–అక్షరటుడే, ఎల్లారెడ్డి

# ఉపాధి కూలీలకు వరం

- అమలులోకి వచ్చిన కొత్త చట్టం
- పెరగనున్న పనిదినాలు
- 15 రోజుల్లో డబ్బులు జమ

కామారెడ్డి జిల్లాలో 532 గ్రామపంచాయతీలు ఉండగా.. సుమారు 2.15 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కేంద్రం ప్రకటించిన నూతన చట్టం ప్రకారం పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడంపై జిల్లాలోని కూలీలు పండుగ చేసుకుంటున్నారు. అదనంగా లభించే 25 రోజుల పని భరోసా తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన కూలి

మారిన చట్టం ప్రకారం వేతనాల సవరణ కూడా కూలీలకు ప్రయోజనకరంగా మారింది. తెలంగాణలో గతంలో ఉన్న రోజువారీ కూలి రూ. 308కి పెరిగింది. ఈ మార్పుల ద్వారా ఏడాది పొడవునా 125 రోజులు పూర్తిగా పనిచేసే తెలంగాణ కూలీకి వార్షికంగా రూ. 38,500 స్థిర ఆదాయం లభించనుంది. ఈ ఆదాయం గ్రామీణ పేదరిక నిర్మూలనకు, స్థానిక కొనుగోలు శక్తి పెంపునకు ఎంతగానో దోహదపడనుంది.

### వలసలకు చెక్..

స్థానికంగానే ఎక్కువ రోజులు పని లభిస్తుండడంతో ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గనుంది. మరోవైపు, వ్యవసాయ పనుల సీజన్‌లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీలుగా 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఇచ్చే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించారు. దీంతో రైతులకు కూలీల కొరత తప్పనుంది. పారదర్శకతకు పెద్దపీటపనుల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా బోగస్ కార్డులను ఏరివేసేందుకు కేంద్రం బయోమెట్రిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిఘా వ్యవస్థను ప్రవేశపెట్టింది. పని పూర్తి చేసిన 15 రోజుల్లోపే నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఒకవేళ చెల్లింపులు ఆలస్యమైతే నష్టపరిహారం కూడా చెల్లించాల్సి ఉండటంతో అధికారుల్లో జవాబుదారీతనం పెరగనుంది.

## అమృత్ 2.0 పనులను త్వరగా పూర్తి చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అమృత్ 2.0 అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పనులను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎల్లారెడ్డి పెద్ద చెరువుపై చేపడుతున్న పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్లారెడ్డికి వచ్చిన కలెక్టర్‌ను ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పాలకవర్గం ప్రతినిధులు సన్మానించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పెద్ద చెరువులో నీటిమట్టం తగ్గాక పూడికతీత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అమృత్ 2.0 పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి మౌలిక వసతులు అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

### హాజీపూర్‌లో నర్సరీ పరిశీలన

హాజీపూర్‌లోని నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. వన మహోత్సవంలో కావాల్సిన మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చి వర్షాలు కురవగానే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఆయిల్ పామ్ తోటల పెంపకంపై శ్రద్ధ చూపేలా అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం గండి మాసానిపేటలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. పాడి పరిశ్రమ పెంపొందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మాచాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులకు గర్భిణులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. మాచాపూర్ గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.

## విద్యాసంస్థలపై దాడి చేస్తే కేసులు



**అక్షరటుడే, బోధన్ :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని విద్యాసంస్థలపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ సాయి చైతన్య హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడినట్లు సమాచారం ఉందన్నారు. వసతులు లేవని, పుస్తకాలు విక్రయిస్తున్నారనే కారణాలతో విద్యాసంస్థలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఇలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యాసంస్థలకు సంబంధించి నటువంటి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వాటిపై సంబంధిత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్..



**అక్షరటుడే, బోధన్:** రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు పాములు, విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉన్న గుంతలలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. సిబ్బంది అటెండెన్స్, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. నాసిరకం బియ్యం, సరుకులు సరఫరా చేస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్‌వో ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, మరమ్మతులు చేయించాలని అన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు.

## పీసీసీ చీఫ్‌కు దమ్ముంటే ఆర్మూర్ నుంచి పోటీచేయాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఆర్మూర్ నుంచి పోటీ చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ మేరకు నగరంలో బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని.. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. ఇద్దరం ఉప ఎన్నికల్లో నిలబడితే ఎవరు గెలుస్తారో చూద్దామని రాకేష్ రెడ్డి సవాల్ విసిరారు. జిల్లాలో అభివృద్ధి శూన్యమని కేవలం రాజకీయ పదవుల కోసం మాత్రమే కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నారన్నారు. మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవి కానీ పీసీసీ అధ్యక్ష పదవి గాని ఎవరికి లాబీయింగ్ చేస్తే వచ్చాయో ప్రజలకు తెలుసన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఒక్కసారి కూడా గెలవని మహేష్ కుమార్ గౌడ్ తన గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి జిల్లాకు అన్యాయం చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్‌కు అతి త్వరలో ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు మాత్రమే నిధులు ఇస్తుందని.. మిగతా జిల్లాలను పట్టించుకోవట్లేదన్నారు. నెలకు ఒకసారి ఢిల్లీకి సూట్ కేసులు మోస్తూ రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్‌లు పదవులు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు 210 లేఖలు రాసినా నిధులు మాత్రం మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, దమ్ముంటే జిల్లా అభివృద్ధికి నిధులు తెచ్చి రాజకీయ చతురత చూపాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా ఫ్లోర్ లీడర్ ప్రమోద్, నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగ మేళాకు విశేష స్పందన..



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా శిక్షణ ఉపాధి కల్పన శాఖ, టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళా, జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నగరంలోని వర్ని చౌరస్తా సమీపంలోని జనార్దన్ గార్డెన్‌లో గురువారం మేళాను నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతి రెడ్డి, మేయర్ ఉమారాణి, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి జాబ్ మేళాను సందర్శించారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాది కల్పన శాఖ అధికారి వేల్పుల విజేత, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ధన్‌పాల్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా వర్షాలు ప్రారంభమయ్యాయని, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పరచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు. నాలాలు సరిగా లేనిచోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అధిక వర్షపాతం నమోదైనప్పుడు నాలాలు వెంటనే శుభ్రం చేయాలన్నారు. నీరు నిండిన చోట తోడేందుకు భారీ మోటార్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.

## ప్రతి కుటుంబంలో ఆర్థిక ఎదుగుదల కనిపించాలి




**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** మహిళా సంఘాల్లోని ప్రతి కుటుంబంలో ఆర్థిక ఎదుగుదల కల్పించేలా కృషి చేయాలని సెర్ప్ (హైదరాబాద్) ప్రాజెక్టు మేనేజర్ నరసింహాస్వామి అన్నారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను ఆయన సందర్శించారు. ఆర్థిక అక్షరాస్యత శిక్షణ పొందిన శిక్షణార్థులతో కలిసి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సాక్షన్ అనే యాప్ ద్వారా సంఘాల సమాచారాన్ని ఏ విధంగా నమోదు చేయాలో వివరించారు. సంస్థలో జరుగుతున్న ఉమెన్స్ టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ శిక్షణార్థులను కలిసి వసతులు, భోజనం భోజనం ఎలా ఉన్నాయో అడిగి తెలుసున్నారు. ఆయన వెంట డీఆర్డీఏ ఏపీడీ మధుసూదన్, సంస్థ డైరెక్టర్ రవి కుమార్, డీపీఎం సంధ్యారాణి ఉన్నారు.



**అన్నదాత ఆలోచన అదుర్స్..**

కేజ్‌వీల్స్ కారణంగా రూ.కోట్లతో వేసిన బీడీ రోడ్లు ఛిద్రమవు తున్నాయి. అయితే పోతంగల్ మండలంలోని హెగ్డోలిలో ఓ రైతు ఆలోచన ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. రైతు పట్టెపు సాయిలు తన పొలంలో దమ్ము చేసిన అనంతరం రోడ్లు పాడవకుండా ఉండేందుకు దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ సాయంతో తీసుకెళ్లాడు. దీనిని చూసిన గ్రామస్థులు రైతు సాయిలు ఆలోచనను అభినందించారు.

– అక్షరటుడే, కోటగిరి



## సీసీ కెమెరాలతో నేరస్తుల ఆటకట్టు

**అక్షరటుడే, ఆర్మూర్:** సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సీసీ కెమెరాలతో నేరస్తులను పట్టుకోవడం సులభం అవుతుందని ఆర్మూర్ ఎస్సై రజినీకాంత్ అన్నారు. మన కాలనీ – మన భద్రత – మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్మూర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మత్తుపదార్థాల వినియోగం దాని దుష్ఫలితాలు, సైబర్ నేరాల, సీసీ కెమెరాలపై షీటీం సభ్యులు అవగాహన సదస్సు కల్పించారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు విగ్నేష్, సుమతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఓ బస్సు సాంకేతిక సమస్యతో గురువారం మార్గమధ్యలోనే నిలిచిపోయింది. బాన్సువాడ నుంచి దెగ్లూర్‌కు బయలుదేరిన బస్సు మండలంలోని బుడ్మి చౌరస్తా వద్ద సాంకేతిక సమస్య తలెత్తడంతో నిలిచి పోయింది. డ్రైవర్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ బస్సు ప్రారంభం కాలేదు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు రోడ్డుపైనే గంటకు పైగా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయ బస్సు పంపిస్తామని అధికారులు చెప్పినప్పటికీ చాలా సేపు మరో బస్సు రాకపోవడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు అసౌకర్యానికి గురయ్యారు. అత్యవసర పనుల కోసం వెళ్లాల్సిన వారు, ఉద్యోగులు, విద్యార్థులు ఆలస్యమవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు కొందరు ప్రయాణికులు అధిక ఛార్జీలు చెల్లించి ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. మరికొందరు అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ డిపోలో కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని, బస్సుల నిర్వహణను మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



# తెయూలో జాడలేని

> ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఉన్నత విద్యా కేంద్రంగా పేరుగాంచిన తెలంగాణ యూనివర్సిటీలో ఇప్పటికీ బీఫార్మసీ కోర్సు లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ తదితర జిల్లాల విద్యార్థులు ఈ కోర్సు కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది.
> —అక్షరటుడే, తెయూ క్యాంపస్

# బీఫార్మసీ, బీపీఈడీ కోర్సులు..

■ **ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

బైపీసీ విద్యార్థులు ఫార్మసీ చదవాలంటే హైదరాబాద్, వరంగల్ లేదా ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కుటుంబాలపై లక్షల రూపాయల ఆర్థిక భారం పడుతోంది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో బీ ఫార్మసీ కోర్సులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ, యూనివర్సిటీ కళాశాలల్లో సీట్లు దాదాపు పూర్తిగా నిండిపోతుండడం ఈ కోర్సుకు ఉన్న ఆదరణకు నిదర్శనం. అయితే నల్గొండలోని మహాత్మగాంధీ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరం బీ ఫార్మసీ కోర్సుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి వచ్చినట్లు అక్కడి వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఇటీవల ప్రకటించారు. త్వరలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు (బీపీఈడీ) ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మన నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో బీ ఫార్మసీ కోర్సు ఆవశ్యకతను విద్యార్థులు గుర్తు చేస్తున్నారు.

### గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు

ఉత్తర తెలంగాణలోని సాధారణ రైతు, కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో చదవాలంటే ఏడాదికి అధిక ట్యూషన్ ఫీజులు, హాస్టల్, మెస్ ఖర్చులు, రవాణాతో తడిసి మోపెడవుతోంది. ఇవన్నీ కలిపి నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సుకు రూ.లక్షల్లో ఖర్చవుతున్నాయి. ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో చాలామంది విద్యార్థులు తమ కలలను మధ్యలోనే వదులుకోవాల్సి వస్తోంది.

### బీపీఈడీ కోర్సు అవసరం

గ్రామాల్లో అపారమైన క్రీడా నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. కానీ, వారికి సరైన దిశానిర్దేశం, ఉన్నత విద్యనభ్యసించేందుకు స్థానికంగా అవకాశాలు లేకపోవడం ఒక పెద్ద లోటుగా మారింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) కోర్సును ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల నుంచి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు. అయితే, ఇంటర్ లేదా డిగ్రీ తర్వాత వారు క్రీడలనే కెరీర్‌గా ఎంచుకోవడానికి ఇక్కడ బీపీఈడీ కోర్సు అందుబాటులో లేదు.

### బీపీఈడీ కోసం హైదరాబాద్.. మహారాష్ట్ర

ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాల విద్యార్థులు బీపీఈడీ చేయాలంటే హైదరాబాద్ (ఉస్మానియా), వరంగల్ (కాకతీయ), పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడంతో హాస్టల్ ఖర్చులు, ఫీజులు పేద విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఎంతో మంది ప్రతిభావంతులైన మహిళా క్రీడాకారిణులు తమ క్రీడా జీవితాన్ని మధ్యలోనే ముగించేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టబోయే ఉపాధ్యాయ నియామకాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులు కీలకమైనవి. స్థానికంగా బీపీఈడీ కోర్సు అందుబాటులో ఉంటే, ఇక్కడి యువత శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించే అవకాశం మెరుగవుతుంది.



## కలెక్టర్ వస్తున్నారని తెలిసి అంగన్‌వాడీల్లో తనిఖీలు

**అక్షరటుడే,పెద్దకొడప్‌గల్:** మండలంలోని బూర్గుపల్లికి గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వస్తున్నారనే సమాచారంతో అధికారులు క్యూ కట్టారు. దీంతో స్థానికులు ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ పర్యటనకు సంబంధించిన సమాచారం అందగానే ఐసీడీఎస్ అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో హడావుడిగా తనిఖీలు నిర్వహిస్తూ రికార్డులు, పరిశుభ్రత, పౌష్టికాహార పంపిణీ, హాజరు నమోదులను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేస్తూ లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. అయితే.. ఈ హడావుడి తనిఖీలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యటనలు ఉన్నప్పుడే అధికారులకు అంగన్‌వాడీ కేంద్రాలు గుర్తుకు వస్తాయా.. అని నిలదీస్తున్నారు. సాధారణ రోజుల్లో పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని కేంద్రాల్లో లోపాలు నెలకొన్నాయని పేర్కొన్నారు.



## టీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**అక్షరటుడే, బోధన్:** తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత గురువారం ఉప్పల్‌లోని భగాయత్‌లో భూపోరాటంలో పాల్గొన్నారు. అయితే ఈ పోరాటానికి నిజామాబాద్‌లోని జిల్లా నేతలు తరలకుండా పోలీసులు కట్టడి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ టీఆర్ఎస్ నాయకుడు, బినోల సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మండ్లును ముందస్తు అరెస్ట్ చేసి నవీపేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## పశువుల వైద్యుడు కావాలని గ్రామస్థుల వినతి

**అక్షరటుడే, కోటగిరి :** పశువుల వైద్యుడిని వెంటనే నియమించాలని పోతంగల్ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాయబ్ తహశీల్దార్ హాజీజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుడు బజరంగ్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో పశువులకు సీజన్ వ్యాధులు, మేకలకు, గొర్రెలకు, గేదెలకు దూడలకు, వచ్చే అవకాశం ఉందని.. వెంటనే వైద్యుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, గంధపు హన్మాండ్లు, ఓమన్ పటేల్, కిరణ్ సేట్, సూదం సాయిలు, శంకర్, యామ గంగారం, అశోక్ తదితరులు ఉన్నారు.



## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే జాజాల



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ బంజే శివకుమార్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యుడు జాజాల సురేందర్ గురువారం బంజే శివకుమార్ నివాసానికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని స్వయంగా పాడె మోశారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే, వారికి మనోధైర్యం కల్పించారు. శివకుమార్ పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఉన్నారు.

## జీజీహెచ్ ఎదుట కార్మికుల ధర్నా

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు పెరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పీఆర్సీ ప్రకటించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.




## పండరీపూర్ మహాపాదయాత్ర ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని విఠలేశ్వర మందిర్ నుంచి ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) సందర్భంగా భక్తులు పండరీ పూర్ మహా పాదయాత్ర గురువారం ప్రారంభించారు. దుండ మహారాజ్, నాగ నాథ్ శాస్త్రి ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమైంది. కోటగిరి నుంచి బయలుదేరి పోతంగల్ బాలాజీ మందిర్ వరకు భక్తులు పాదయాత్రగా చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగనాథ్ శాస్త్రి మహారాజు మాట్లాడుతూ.. ఆషాఢ శుద్ధ ఏకాదశి మాసంలో పండరిపూర్ యాత్ర చేయడం ఎంతో అదృష్టమన్నారు. పాదయాత్రలో విజయ్ మహారాజ్ దొండి మహారాజ్, గంధపు ప్రకాష్, సంతోష్ మహారాజ్, నారాయణ,తిలక్ సేట్, శకుంతల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌శాఖలో నియామకాలు చేపట్టాలి

**అక్షర టుడే, ఆర్మూర్ :** పోలీస్‌శాఖలో మిగిలిఉన్న 20వేల ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండల కేంద్రంలో లైబ్రరీ భవనం ఎదుట సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 19,000 ఎస్సై, కానిస్టేబుల్ ఖాళీలు ఉన్నాయని చెప్పి కేవలం ఐదు వేలకే మొదట నియామకాలు ప్రారంభిస్తామని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ వేస్తామని చెప్పిందని కాని రెండున్నరేళ్లలో హామీలను తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు వికాస్, దుర్గాప్రసాద్, అంజి, రవి, యువకులు పాల్గొన్నారు.




## బీసీ గురుకుల ఆశ్రమ పాఠశాల తనిఖీ



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాకేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో బట్టు రాజేశ్వర్‌లతో కలిసి పాఠశాలలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులు, భోజన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం, పండ్లు, గుడ్లు సక్రమంగా అందుతున్నాయా అని పరిశీలించారు. డ్రెయినేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ఏపీవో ఇందిరా, ఆరోగ్యశాఖ అధికారి రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## హౌజింగ్ బోర్డు వద్ద నీటి నిల్వకు చెక్..



**అక్షరటుడే, కామారెడ్డి:** హైదరాబాద్ వెళ్లే రహదారిపై వర్షం నీరు నిలిచిపోతున్న సమస్యపై 'అక్షరటుడే' పత్రికలో కథనం ప్రచురించంగా అధికారులు స్పందించారు. నీరు నిల్వ లేకుండా మార్గం సుగమం చేశారు. కామారెడ్డి పట్టణంలో హైదరాబాద్ వెళ్లే దారిలోని హౌజింగ్‌బోర్డు సమీపంలో ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు డౌన్‌గా ఉండటం, డ్రైనేజీ మార్గం లేకపోవడంతో చిన్న వర్షానికే నీరు నిలిచి చెరువులా మారుతోంది. దీంతో మెకానిక్ షాపుల వద్దకు వచ్చే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలో నీరు చేరి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ అంశంపై గతనెల 29న 'వర్షపు నీరు వెళ్లే మార్గమేది..' అనే శీర్షికతో 'అక్షరటుడే' కథనం ప్రచురించింది. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించారు. హౌజింగ్‌బోర్డు సమీపంలోని అతిథి బార్ ఎదురుగా జేసీబీతో ప్రత్యేక కాలువ తవ్వించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా సత్య గార్డెన్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. సమస్య పరిష్కారమైనందుకు అధికారులకు, సమస్యను వెలుగులోకి తెచ్చిన అక్షరటుడే యాజమాన్యానికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాం చేస్తూ ఈనెల 10న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. ఈ మేరకు నగరంలోని సుభాష్ నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. విద్యాశాఖకు ఇప్పటివరకు మంత్రి లేకపోవడం విడ్డూరమని.. 24వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకు కుదించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యా వ్యాపారాన్ని అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.9వేల కోట్లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబోధ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు డా కర్క గణేష్, ఏఐఎఫ్‌డీఎస్ వినోద్, ఏఐపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.